క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ఎస్.అన్నవరంలో స్వామివారికి అభిషేకిం చేందుకు వెండి కలశాల్లో పంచామృతాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తిరు నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు 108 వెండి కలశాలల్లో పంచామృతాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వయంగా పంచామృతాలను తీసుకువెళ్లగా అర్చకులు స్వామి, అమ్మవార్లకు అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేంద్ర పథకాలతో పేదలకు మేలు



ఏలేశ్వరంలో పార్టీ స్థూపాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన జెండా స్థూపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్రంలో ఒకసారి, కేంద్రంలో మరోసారి అవకాశం ఇవ్వాలనే నినాదంతో ముందుకు వెళతామన్నారు. అధికారం చేపట్టే దిశగా పార్టీశ్రేణులకు సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా సభ్యుడు గట్టెం వెంకటరమణ, గొల్లపూడి సత్యనారాయణ, గొల్లపల్లి త్రినాథ్, విజయ థామస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



ఎస్ఎస్ వెంకటాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

తుని రూరల్: బీజేపీ పాలనలో మహిళలు రక్షణ కరువైందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తుని ఏరియా కార్యదర్శి కె.జనార్దన్ అన్నారు. తుని మండలం ఎస్ఎస్ వెంకటాపురంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలను నగ్నంగా ఊరేగించిన, మహిళా రెజ్లర్లను అసభ్యకరంగా దూషించిన కేంద్ర మంత్రులు, ఎంపీలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను ఓడించాలన్నారు. కార్యక్రమంలో వాడబోయిన శివ, గుద్దటి పాప, దండా నూకరత్నం, మోర్తా మహాలక్ష్మి, బోడపాటి రాజులమ్మ, కాపారపు నాగరత్నం, చెదులూరి తాతారావు, గుద్దటి అప్పారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనం స్థలాన్ని వదలం

జగ్గంపేట: గ్రామంలో అంబేడ్కర్ సామాజిక భవనానికి కేటాయించిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించాలని ప్రయత్నం చేస్తున్నారని, ఆ స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోమని డాక్టర్ భీమారావు అంబేడ్కర్ సామాజిక భవన కమిటీ సభ్యులు తెలిపారు. జగ్గంపేటలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అంబేడ్కర్ భవనానికి స్థలాన్ని కేటాయిస్తే అప్పట్లో మాట్లాడని నేతలు ఇప్పుడు ప్లేట్ ఫిరాయించి ఆ స్థలం ఇవ్వకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు కల్పించినా అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని వదులుకోమని స్పష్టం చేశారు.

రథోత్సవానికి రంగం సిద్ధం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలత్రిపుర సుందరి, కుమారారామ భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు రథాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య రథం గాంధీ చౌక్ సెంటర్ నుంచి మళ్లీ అక్కడి వరకు సాగనుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు రథోత్సవ కమిటీ తెలిపింది.



ఏలేశ్వరంలో శివాలయం వద్ద భక్తుల కోలాహలం



తునిలో స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



మల్లికార్జున లొద్దులో పరమ శివుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



దానవాయిపేట బీచ్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

హరహర మహాదేవ

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నదులు, పుష్కరిణులు, కాలువల్లో పుణ్యస్నానాలు



ఏలేశ్వరం వద్ద ఏలేరు నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం/తుని/గోకవరం/రౌతులపూడి/ప్రత్తిపాడు రూరల్/శంఖవరం/కోటనందూరు/గండేపల్లి/ తొండంగి/కిర్లంపూడి: హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. తెలవారుజాము నుంచే శివాలయాలకు పోటెత్తారు. నదులు, కాలువలు, పుష్కరిణిల్లో భక్తులు వేలాదిగా పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరా స్వామి ఆలయంలో అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం సమీపంలోని ఏలేరు నదిలో వేలాదిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శివాలయం నుంచి ఏలేరు నది వరకు రహదారి భక్తులతో కిటకిటలాడింది. ఏలేరునదికి సమీపంలోని బ్రాహ్మణరేవు ఒడ్డున, శ్మశానవాటిక వద్ద ఉన్న శివుని విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో పలు సంస్థలు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు. బాలాజీ చౌక్ వద్ద ధర్మకర్త గోపు వెంకట్రావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ వినాయకుని గుడి వద్ద భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. వీహెచ్‌పీ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకటప్రసాద్, కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య పాల్గొన్నారు. ఏలేశ్వరం వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంచుతో శివలింగం, వినాయక, వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. తుని కత్రాళ్ల కొండ తాండవ ఉమారామలింగేశ్వరస్వామి ఆయాలనికి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. పరమశివుని దర్శనం కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. తుని పెద్దవీధి, గవరపేట ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణమంతా శివనామస్మరణతో మార్మోంగింది. ఆలయ కమిటీలు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాయి. పట్టణంలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగాన్ని పలువురు దర్శించుకున్నారు.

నందనవనంలో కోలాహలం

రౌతులపూడి మండలం శృంగవరం-మెరక చామవరం సమీపంలోని నందనవనంలో స్వయంభూ వెలసిన ఉమావర్దినీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. రౌతులపూడిలో వేంచేసిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటనందూరు బస్టాండ్ సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చోడిశెట్టి బాలాజీరావు, కార్యనిర్వహక కార్యదర్శి అమలకంటి కొండలరావు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వీరాంజనేయస్వామిని ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఏపీబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్ తదితరులు దర్శించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

ధార క్షేత్రంలో..

శంఖవరం మండలంలోని శివాలయాలు తెల్లవారు జాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. శంఖవరం, వేళంగి, కత్తిపూడి, మండపం గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పొటేత్తారు. గిరిజన ప్రాంతమైన వేళంగి లొద్దులోని ధార క్షేత్రంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ధారమల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద భక్తి గీతాలతో భజనలు చేశారు. మల్లి ఖార్జున స్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. గండేపల్లి మండలంలోని శివాలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూ కట్టారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గండేపల్లి, మురారి, ఉప్పలపాడు, నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేట, నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాల్లోని ఆలయాల వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గోకవరం మండలంలోని శివాలయాలు తెల్లవారు జాము నుంచి శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి, ప్రధానర హదారి పక్కన ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, మురళీనగర్‌లోని బాలాత్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్తపల్లిలోని సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన రెడ్డిరాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి, తంటికొండలోని అఖిలాండేశ్వరి సమేత జంభుకేశ్వరస్వామి, కృష్ణునిపాలెంలోని పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఆలయాల వద్ద పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాలను తిలకించారు.

జలపాతాలకు పోటెత్తిన భక్తజనం

ప్రత్తిపాడు మండలంలోని యరకంపాలెం, ధారపల్లి, తోటపల్లి అటవీప్రాంతాల్లోని జలపాతాల్లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. జలపాతాల ఆవరణలో వెలసిన ధారమల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. యరకంపాలెంలో స్వామివారికి అర్చకుడు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి రామానంద ఆధ్వర్యంలో స్వామివారికి మహా రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ప్రత్తిపాడు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, ధర్మవరం విశ్వేశ్వరస్వామి ఆలయం, ఒమ్మంగి స్వయంభూ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, గజ్జనపూడిలోని రామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యరకంపాలెం, గజ్జనపూడి గ్రామాల్లో రాత్రంతా జాగారం నిర్వహించారు. కిర్లంపూడి మండలంలోని కిర్లంపూడి, చిల్లంగి, వేలంక, భూపాలపట్నం, కృష్ణవరం, బూరుగుపూడి, గోనేడ, పాలెం, వీరవరం, సోమవరం గ్రామాల్లోని శివాలయాలు కిటికిటలాడాయి.



ఒంటిమామిడిలో విశ్వేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు

మహాశివరాత్రిని పురస్కరించుకుని తొండంగి మండలంలోని దానవాయిపేట, తాటియాకులపాలెం, యర్రయ్యపేట తదితర సముద్ర తీరప్రాంతాల్లో పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఒండిమామిడి విశ్వేశ్వరస్వామి ఆలయంలో పండితులు పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. తొండంగి, పి.ఇ.చిన్నాయపాలెం, బెండపూడి, ఎ.కొత్తపల్లి శృంగవృక్షం, అద్దరిపేట, పంపాదిపేట, పైడికొండ శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. . గోపాలపట్నంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.



యరకంపాలెం జలపాతం వద్ద భక్తుల రద్దీ



వేళంగి మల్లికార్జున లొద్దులో స్నానమాచరిస్తున్న భక్తులు



గోకవరంలో గోకర్ణేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపిద్దాం



బొర్రంపాలెం ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి, శ్రీనిధి తదితరులు

గండేపల్లి: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి తోట వాణి పిలుపునిచ్చారు. మండలంలోని బొర్రంపాలెంలో శుక్రవారం తోట వాణి, ఆమె కోడలు శ్రీనిధితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, సర్పంచులు పోకల సుబ్బు, ములంపాక సురేష్, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, పార్టీ నేతలు కుంచే చినబాబు, రామకుర్తి మూర్తి, పరిమి వెంకటేశ్వరరావు, కందిరెల్లి కామేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్, జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



తుని టీచర్స్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్ సుధారాణి, నాయకులు

తుని: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 24వ వార్డు టీచర్ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ సీసీ రోడ్లు, కాలవలు నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు మంత్రి దాడిశెట్టి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు చెబుతున్న మాయ మాటలను నమ్మితే మనమే మోసపోతామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, వార్డు కౌన్సిలర్ పులి సత్తిబాబు, కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల తనిఖీ

పెద్దాపురం: మండలంలోని సంపద తయారీ కేంద్రాల వద్ద అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తప్పవని ఎస్‌డబ్ల్యూపీసీ రిసోర్స్ పర్సన్ జి.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని వడ్లమూరు, గోరింట, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామ పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శుక్రవారం ఆయన మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌తో కలసి తనిఖీలు చేశారు. ఆయా కేంద్రాల వద్ద డంపింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త రోడ్లపై లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

జోరుగా అపరాల పంట ఒబ్బిడి



గోపాలపట్నంలో అపరాల పంటను ఒబ్బిడి చేస్తున్న కూలీలు

తొండంగి: మండల వ్యాప్తంగా అపరాల పంట ఒబ్బిడి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది మండలంలో 1270 హెక్టార్లలో పెసర, 470 హెక్టార్లలో మినుము పంటలను రైతులు సాగు చేశారు. పంట కాలం పూర్తికావడంతో అన్నదాతలు పంటను ఒబ్బిడి చేస్తున్నారు. కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. మరో వారం రోజుల్లో అపరాల ఒబ్బిడి పనులు పూర్తవుతాయని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం తెలిపారు.

వనితకు వందనం

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలను సత్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



తునిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అమర్ ఫౌండేషన్ ప్రతినిధులు



బొద్దవరంలో సర్పంచ్ వేగి లక్ష్మిని సన్మానిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడులో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా న్యాయవాదులు మాదాల మంజూష, పిల్లి సుధారాజేశ్వరి, మండల న్యాయ సేవాధికార సంస్థ బాధ్యురాలు శ్రీలక్ష్మి, న్యాయవాద గుమస్తాలు దివ్య, విజయలక్ష్మిలను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెలంకూరి రామకృష్ణ , అధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య, కార్యదర్శి బొంగులూరి మధుబాబు, న్యాయవాదులు పిల్లి బలరాముడు, రెడ్నం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కోటనందూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని బొద్దవరం సచివాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళల రక్షణ, స్వేచ్ఛకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. మహిళలను విద్య, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం సర్పంచ్ వేగి లక్ష్మి, ఎంపీటీసీ లగుడు దుర్గాభవానీలను శాలువా, మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దొడ్డి బాబ్జీ, పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం: పట్టణంలోని 6వ వార్డులో శుక్రవారం మున్సిపల్ కౌన్సిలర్ కోనాల వెంకటరమణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. టీడీపీ నియోజకర్గ కన్వీనర్ వరుపుల సత్య ప్రభ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగండి నాగబాబు, భజంతుల మణి, మామిడి మాధవి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మహిళలకు పురుషులతో సమానంగా పని కల్పించి సమానంగా వేతనాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకుడు సామిరెడ్డి నారాయణమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలకు రాజకీయాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు పి.లక్ష్మి, టి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక రంగవల్లి నగర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలు తమ హక్కులు పరిరక్షణకు పోరాటాలు సాగించాలని సూచించారు. రాజపూడి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



ప్రత్తిపాడులో మహిళా న్యాయవాదులను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

అన్నిరంగాల్లో ముందుండాలి

తుని: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలవాలని అమర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దల్లి శ్యాంసన్ సూచించారు. స్థానిక కొండవారిపేటలో శుక్రవారం అమర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, మాజీ కౌన్సిలర్లు, ఉదయరేఖ మహిళా మండలి సభ్యులను ఘనంగా సత్కరించారు. సుమారు 250 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దల్లి అమర్‌నాథ్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి రవికుమార్‌ను అభినందిస్తున్న ఆదిత్య కళాశాల సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్.రవికుమార్ నెట్ బాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ డోలా సంజయ్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న రవికుమార్ ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో ఇటీవల నిర్వహించిన జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ నెట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు. విశేష ప్రతిభ కనబరిచి ఈ నెల 12 నుంచి 15 వరకూ కర్ణాటకలో జరిగే హైయర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను కళాశాల సిబ్బంది, అధ్యాపకులు అభినందించారు.